నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
## కర్నూలు | నంద్యాల
సోమవారం | 13 జనవరి 2025 పేజీలు 8

# ముగిసిన జాతీయ జానపద ఉత్సవాలు

- బహుమతులు ప్రధానం చేసి ప్రసంగించిన టీజీ వెంకటేష్



జ్యోతి ప్రజ్వోలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**కర్నూలు కల్చరల్, మేజర్ న్యూస్ :** జాతీయ స్థాయి శాస్త్రీయ జానపద నృత్యోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు హాజరు కావటం ఆనంద దాయాకమన్నారు మాజీ రాజ్యసభ సభ్యులు వెంకటేష్. మూడు రోజులుగా కర్నూలు నగరంలో జరుగుతున్న జాతీయస్థాయి జానపద శాస్త్రీయ నృత్య పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీ వెంకటేష్ మాట్లాడుతూ

మిగతా 2లో

## భృంగివాహనం పై
# శ్రీశైలేశుడు

- శ్రీగిరిలో వైభవంగా కొనసాగుతున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాలు
- భృంగివాహనాధీశులను దర్శించి తరించిన భక్తజనం
- నేడు చిన్నారులకు భోగిపండ్ల కార్యక్రమం



భృంగివాహనం పై ఊరేగుతున్న మల్లన్న భ్రమరాంబిక దేవిలు





**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల మహా క్షేత్రంలో మకర సంక్రాంతిబ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక భరితంగా కొనసాగుతున్నాయి.బ్రహ్మోత్సవాల రెండో రోజు నుంచి వాహన సేవలు మొదలయ్యాయి. ఆదివారం రాత్రి భ్రమరాంబా సమేత శ్రీశైల మల్లికార్జునుడు భృంగి భుజస్కందాలపై ఊరేగాడు. సాయంత్రం 6.30గం టలకు ఆలయంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మేళతాళాల నడుమ భృంగి వాహనంపై ఆశీనులు చేశారు.అనంతరం ఉత్సవ మూర్తులకు ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత భృంగివాహనాధీశులైన స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయ ధ్వజస్తంభం వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక హారతులను ఇచ్చారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో కళాకారుల నృత్యాలు,డప్పు వాయిద్యాలు,తప్పెట్లు. కోలాటం,పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భృంగివాహనంలో ఆశీనులైన స్వామి అమ్మవార్లను దర్శించడం వలన చేసే పనుల్లో ఏకాగ్రత లభిస్తుందని, పాపాలు హరించబడ తాయని పండితులు వివరించారు.

మిగతా 2లో

**కర్నూలు, కల్చరల్ మేజర్‌న్యూస్ :** సంక్రాంతికి ఒక రోజు ముందు భోగి పండుగతో సంబరాలు మొదలవుతాయి. భోగి అంటేభోగ భాగ్యాలనుఅనుభవించే రోజు అని అర్ధం. ఎలాగంటే పాడి పంటలు సమృద్ధిగా ఇండ్లకు వచ్చే కాల సమయం. తెలుగు ప్రజలు జరుపుకొనే అతి పెద్ద పండుగ సంక్రాంతి. ముఖ్యంగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంత ప్రజలు ఈ పండుగను నాలుగు రోజులపాటు ఘనంగా జరుపుకొంటారు. సూర్యుడు మకర రాశిలోకిప్రవేశించినరోజునే మకర సంక్రాంతి పండుగ జరుపుకుంటారు. గొబ్బెమ్మలు, భోగి మంటలు, గంగిరెద్దులు, పిండి వంటలు, హరిదాసుకీర్తనలు,రథం ముగ్గులు, కోడి పందేలు.. ఇలా సంకాంత్రి వచ్చిందంటే ఆ సందడే వేరు. ఈ పండుగ తొలి రోజును 'భోగి'గా పిలుస్తారు. రెండో రోజును 'మకర సంక్రాంతి'గా, మూడో రోజును 'కనుమ'గా పిలుస్తారు. నాలుగో రోజును 'ముక్కనుమ' అంటారు. ఈ రోజు సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి అభ్యంగన స్నానానంతరం ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేసుకొని పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ భోగి మంటలలో పాత పనికిరాని వస్తువులను,వేసి పీడలను,అరిష్టాలను తొలగించుకుంటారు.తెల్లవారక ముందేభోగిమంటలతో మొదలుకుని కుటుంబంలో

మిగతా 2లో

భోగి అనగా అర్ధం ఏమిటి..?

# నేడు భోగి పండుగ



## వివేకానంద జయంతిని
# విస్మరించిన అధికారులు

- కనీసం సర్కిల్‌ను శుభ్రం చేయని కెఎంసి
- ప్రతి ఏటా పూలతో అలంకరించే పనికి ఈ ఏడు రెడ్‌సిగ్నల్
- నిధుల కొరతే కారణమంటూ సాకులు చెబుతున్న కెఎంసి



నిరుడులా..



ఈ ఏడు ఇలా..

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** స్వామి వివేకానందుడి జయంతిని జాతీయ యువజనోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించి ఏటా ఆయన జన్మదినోత్సవాలను నిర్వహిస్తోంది. అయితే కర్నూలు అధికారులు ఆయనను మరిచారు. నగరంలోని వివేకానంద సర్కిల్ (రాజ్‌విహార్) వద్ద ఉన్న నిలువెత్తు స్వామి వివేకానంద విగ్రహంవద్ద కనీస ఏర్పాట్లు కూడా

మిగతా 2లో



రాష్ట్ర మంత్రి టిజి. భరత్

7లో

## చంద్రబాబు విజన్‌తోనే
# గ్రీన్ కో ప్రాజెక్ట్

- 2018లోనే ప్రాజెక్టు పెట్టేందుకు ఎంవోయూ కుదిరింది
- గ్రీన్ కో ప్రాజెక్టు విషయంలో వైసీపీ ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు పెట్టింది
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్

# వైసిపి ప్రభుత్వం లోనే గ్రీన్ కో ప్రాజెక్ట్ ఆవిర్భావం

- వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి
- ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇప్పించాలి
- పరిశ్రమకు భూములు ఇచ్చిన పిన్నాపురం తండా ప్రజలకు కృతజ్ఞతలు చెప్పాలి
- వైయస్ జగన్ పరిశ్రమలకు ఎప్పుడు వ్యతిరేకం కాదు..



7లో

సూర్య

సోమవారం | 13 జనవరి 2025

# ముగిసిన జాతీయ జానపద ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)



**విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్**

కర్నూల్ నగరం మతసామరస్యానికి పెట్టింది పేరు అన్నారు. హిందూ ముస్లిం క్రైస్తవ సోదరులు కలిసి మెలిసి పండుగల జరుపుకోవాలని అంతకు ముందు టీజీవి కళాక్షేత్రంలో మాట్లాడుతూ అన్నారు. గత పది సంవత్సరాలుగా టీజీవి కళాక్షేత్రంలో నటరాజ నృత్య కళామందిరం కళాశాల అవార్డుల కోసం పోటీలు నిర్వహించడం అనేక రాష్ట్రాలకు చెందిన కళాకారులు మూడు రోజులపాటు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పోటీల్లో పాల్గొని ప్రదర్శించారని చెప్పారు నిర్వాహకులు కరీముల్లా స్వాగతం పలుకుతూ 200 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన కళాకారులు పాల్గొనట్లుగా జరిపారు అదే విధంగా చిన్న జీయర్ స్వామి ఆస్థాన నాట్యాచార్యులు ఘంటసాల పవన్ అనంతపురం కూచిపూడి నాట్యాచార్యులు ఇంకా అనేకమంది నాట్యాచార్యులు ఉత్సవాలలో పాల్గొనాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పట్నం శివప్రసాద్ డాక్టర్ చంద్రశేఖర్ ఇల్లూరు లక్ష్మయ్య చంద్రశేఖర్ వ్యాఖ్యాత సునీత పాల్గొన్నారు నగదు పారితోషికంతో పాటు ప్రశంసా పత్రాలు జ్ఞాపికలను టీజీ వెంకటేష్ అందించారు. దీంతో జాతీయస్థాయి శాస్త్రీయ జానపద నృత్య పోటీలు వైభవంగా ముగిశాయి.

### సేవ్ నేచర్.. సేవ్ వాటర్ నినాదంతో

# దేశమంతా పాదయాత్ర

**-రోజుకు 21 కిలోమీటర్లు నడక - మరో రెండేండ్లు ఈ పాదయాత్ర సాగనుంది**




**తిరుపతికి వెలుతున్న సుమంత్ అశ్విన్**

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** సేవ్ నేచర్,సేవ్ వాటర్ నినాదంతో భారతదేశంను మొత్తం పాదయాత్ర నిర్వహిస్తున్న సుమంత్ అశ్విన్ ఆదివారం గోనెగండ్లకు చేరుకున్నారు. ఈ యువకుడు ప్రజలు ఎక్కువగా ఉన్న చోట ప్రకృతిని, నీటిని కాపాడుకోవడం వల్ల కలిగే లాభాలను వివరిస్తు ముందుకు సాగుతున్నాడు. సుమంత్ అశ్విన్ కర్ణాటక లోని బెంగుళూరు కు చెందిన వాడు. బెంగళూరులో బీటెక్ చదువుతు మధ్యలోనే చదువును నిలిపివేశాడు భారతదేశం అంతా పాదయాత్ర ద్వారా తిరిగి ప్రకృతి, నీరు గొప్పతనాన్ని ప్రజలకు వివరించాలని తలచి గత ఏడాది జూన్ నెల 2వ తేదిన కోలార్ జిల్లా వర్తూర్ నుంచి పాదయాత్ర మొదలు పెట్టాడు. రోజుకు 21 కిలోమీటర్లు ప్రయాణం చేస్తు ఇప్పటికి 700కిలోమీటర్లు ప్రయాణం చేసినట్లు ఆయన తెలిపారు. గత రెండు రోజుల క్రితం మంత్రాలయం చేరుకొని గోనెగండ్ల మీదుగా కర్నూలు కడప చేరుకొని అక్కడి నుంచి తిరుపతి చేరి చెన్నై చేరుకుంటాని తెలిపారు. దారి వెంట దాతలు ఇచ్చే డబ్బుతో తన ఖర్చులు జరుపుకుంటున్నానని తెలిపారు. ఈ పాదయాత్ర మరో రెండేళ్ల పడుతుందని ఆయన తెలిపారు. విషయం తెలుసుకున్న గోనెగండ్ల యుకులు సమంత్ అశ్విన్కుసాదరంగా ఆహ్వానించి సాగనంపారు.

# వివేకానంద జయంతిని విస్మరించిన అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శించారు. ప్రతి ఏటా వివేకానందుడి విగ్రహం సర్కిల్‌ను శుభ్రం చేయించడమే కాకుండా విగ్రహాన్ని పూలతో అలంకరించడం సాంప్రదాయంగా వస్తోంది. కర్నూలు నగరపాలక సంస్థ ఈ పని చేస్తోంది. కానీ ఈ ఏడు నగరపాలక సంస్థ దాన్ని విస్మరించింది. నిధుల కొరత పేరుతో కెఎంసి స్వామి వివేకానందుడి విగ్రహాన్ని పూలతో అలంకరించలేమని చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. ప్రజాధనాన్ని పనికిరాని పనులకు ఉపయోగించడంలో ముందంజలో ఉండే నగర పాలక సంస్థ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన జాతీయ యువజనోత్సవం సందర్భంగా వివేకానంద సర్కిల్‌లో నిధుల కొరత ఉందంటూ చేతులెత్తేయడాన్ని వివేకానందుడి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కెఎంసి అధికారులపై వివేకానంద ఉత్సవ సమితి నేతలు నిప్పులు చెరిగారు. నిధుల కొరత కారణంగానే ఏర్పాట్లు చేయలేకపోతున్నామని కెఎంసి చెబుతోందని, ఇది సమంజసం కాదని వారు పేర్కొన్నారు. లక్షల రూపాయలు వృథా చేస్తూ నాలుగైదు వేల రూపాయల ఖర్చుకు వెనుకాడడం శోచనీయమని వారు అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఉంటున్న జిల్లా కేంద్రంలోనే ఇలా వివేకానందుడిని అవమానించిన సంఘటన చోటు చేసుకోవడం విచారించదగ్గ పరిణామనడంలో ఎలాంటి సందేహం లేదు.

**యువతకు ఆదర్శం: స్వామి వివేకానంద ఉత్సవ సమితి నేతలు :**

అతి చిన్న వయసులో అమెరికాలోని సర్వమత సమ్మేళనంలో పాల్గొని ప్రపంచం దృష్టికి భారతదేశ ఔన్నత్యాన్ని తీసుకవెళ్లిన స్వామి వివేకానంద ఇప్పటికీ, ఎప్పటికీ యువతకు ఆదర్శమని వివేకానంద కేంద్ర నిర్వాహకులు శివప్రసాద్, ఉత్సవ సమితి నేతలు పుల్లయ్య, శ్రీనివాసరెడ్డి, పివి సుబ్బయ్య అన్నారు. స్వామి జయంతి సందర్భంగా ఆదివారం కర్నూలు నగరంలోని స్వామి వివేకానంద సర్కిల్‌లో ఆయన విగ్రహాన్ని పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వారు మాట్లాడారు. ఆయన జన్మించి ఇప్పటికి 173 సంవత్సరాలు అయినా ఆయన ప్రసంగాలు ప్రపంచానికి మార్గదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ఎన్సీసీ క్యాడెట్లు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కూడా స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# భృంగివాహనంపై శ్రీశైలేశుడు

(మొదటి పేజీ తరువాయి)



గ్రామోత్సవంలో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను పలువురు

భక్తులుకన్నులారాదర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, అర్చక స్వాములు భక్తులు పాల్గొన్నారు.

**నేడు కైలాస వాహనంపై మల్లన్న విహారం :** సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోభవారం శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లు కైలాస వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామి అమ్మవార్లను కైలాసవాహన సేవలో ప్రత్యేకంగా అలంకరించి తదుపరి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అలాగే సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని ఉదయం. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉచితంగా సామూహిక భోగి పండ్ల కార్యక్రమం నిర్వహిస్తారు. 5 సంవత్సరాల వరకు వయస్సు కలిగిన చిన్నారులకు ఈ భోగిపండ్లు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

# నిజమైన ఆనందం అనుభవించడమే నిజమైన భోగి..

**-కొడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి..**

**-మండల ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు**

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** సి.బెలగల్ మండల ప్రజానీకానికి భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.నేడు భోగి పండుగ సందర్భంగా కొడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మండల ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ మండల ప్రజలు నిజమైన ఆనందం అనుభవిస్తూ నిజమైన భోగి పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. పిడకలతో భోగి మంటలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. రంగు రంగుల ముగ్గులు నడుమ వేసే మంటలు అనంతరం కొత్తబట్టలు పిండి వంటలు కోడి పందాలు ఇలా భోగి, సంక్రాంతి,కనుమ పండుగలు పిల్ల పాపలతో అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఈ సంక్రాం తి ప్రతి ఒక్కరి జీవితంలో పాడి పంటలతో సుఖసంతోషాలు ఆనందంగా జీవించాలని పండుగ వాతావరణంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ప్రజల జీవితాలలో భోగి వెలుగులు నింపి సంక్రాంతి సిరి సంపదలు చేకూరి కనుమ కనువిందుగా ఈ పండుగ ద్వారా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.



**కొడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి**

# నేడు భోగి పండుగ

(మొదటి పేజీ తరువాయి)

ఆనంద కోలాహలం ప్రారంభం అవుతుంది. మనలో ఉన్న బద్ధకాన్ని, అశ్రద్ధను, మనసులో ఉన్న చెడు తలంపులను ఈ భోగి మంటలలో వేసి ఈ రోజు నుండి నూతన ఆనంద, ఆప్యాయతలతో కూడుకొని ఉన్నజీవితాన్నిప్రారంభిస్తున్నామని ఆత్మారామునికి మాట.. ఇచ్చి భవగత్ సన్నిదిలో నిశ్చయ సంకల్పం చేసుకోవడం జరుగుతుంది.భోగి రోజు చేసే బొమ్మల కొలువు, ముత్తైదువులతో పేరంటం కూడా చేస్తారు. ముఖ్యంగా భోగి పండుగ రోజు పెద్దలు తమ ఇంట్లోని చిన్నారుల తలపై రేగిపళ్లు పోస్తారు. భోగిపండ్ల కోసం రేగుపండ్లు, చెరుకుగడలు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణేలు వాడతారు. కొందరు శనగలు కూడా కలుపుతారు. రేగిపళ్లను పిల్లల తల మీద పోడం వల్ల శ్రీమన్నారాయణుడి దివ్య ఆశీస్సులు లభిస్తాయని భావిస్తారు. భోగి పండ్లు పోయడం వలన పిల్లల మీద ఉన్న చెడు దృష్టి తొలగిపోతుంది. తలపై భాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది. భోగి పండ్లను పోసి దాని ప్రేరేపితం చేస్తే, పిల్లల్లో జ్ఞానం పెరుగుతుంది.

**పురాణాల ప్రకారం..:** రేగి పండ్లను బదరీఫలం అని కూడా పిలుస్తారు. శివుణ్ని ప్రసన్నం చేసుకోవడానికి నరనారాయణులు బదరికావనంలో ఘోర తపస్సు చేశారట. ఆ సమయంలో దేవతలు వారి తలల మీద బదరీ ఫలాలని కురిపించారని చెబుతారు. ఆనాటి సంఘటనకు ప్రతీకగా పిల్లలను నారాయణుడిగా భావించి భోగిపండ్లను పోసే సంప్రదాయం వచ్చిందని ప్రతీతి.భోగి ముగిశాక సూర్యుడు దక్షిణాయణం నుంచి ఉత్తరాయణానికి మరలుతాడు. ఆ రోజే మకర రాశిలోకి అడుగుపెడతాడు. సంక్రాంతి సూర్యుడి పండుగ.. కాబట్టి సూర్యుణ్ని పోలిన గుండ్రని రూపం, ఎర్రటి రంగు కారణంగా దీనికి అర్కఫలం అనే పేరు వచ్చింది. సూర్యభగవానుడి ఆశీస్సులు పిల్లవాడికి లభించాలనే సూచనగా ఈ భోగిపండ్లను పోస్తారు. కౌమర్యంలోకి అడుగు పెట్టడానికి ముందే అంటే.. 12 ఏళ్లలోపు చిన్నారుల తలపై భోగి పండ్లను పోయవచ్చు.సూర్యుడు దక్షిణాయనంలో ఉండే చివరి రోజు భోగి. ఈ రోజు చలి తారస్థాయిలో ఉంటుంది కాబట్టి, భోగిమంటలు వేసుకోమని సూచిస్తుంటారు. భోగినాటికి ఉధృతంగా ఉండే చలి వల్ల క్రిమికీటకాలు ప్రబలే అవకాశం ఉంది కనుక, భోగి మంటలు వాతావరణంలోకి కాస్త వెచ్చదనాన్ని నింపుతాయి. పైగా సంక్రాంతినాటికి పంట కోతలు పూర్తవడంతో, పొలాల నుంచి పురుగూ పుట్రా కూడా ఇళ్ల వైపుగా వస్తాయి. వీటిని తిప్పికొట్టేందుకు కూడా భోగిమంటలు ఉపయోగపడతాయి.భోగి మంట వెనక మరో విశేషం కూడా ఉంది. సంక్రాంతి రోజు నుంచి సూర్యుడు ఉత్తరాయణంలోకి మళ్లుతాడు. దీని వలన ఎండ వేడిలో ఒక్కసారిగా చురుకుదనం మొదలవుతుంది. పరిసరాలలోని ఉష్ణోగ్రతలలో ఒక్కసారిగా వచ్చే ఈ మార్పుని తట్టుకునేందుకు శరీరం ఇబ్బంది పడుతుంది. దీంతో జీర్ణసంబంధమైన సమస్యలు ఏర్పడవచ్చు. భోగిమంటలతో రాబోయే మార్పుకి శరీరాన్ని సన్నద్ధం చేసినట్లవుతుంది.ఇక్కడ ఒక విషయం గమనించాలి. భోగిమంటలు అంటే కేవలం చలిమంటలు కాదు. అగ్నిని ఆరాధించుకునే ఒక సందర్భం. కాబట్టి భోగిమంటలు వేసుకునేందుకు పెద్దలు కొన్ని సూచనలు అందిస్తుంటారు. హోమాన్ని ఎంత పవిత్రంగా రాజేస్తామో భోగి మంటను అంతే పవిత్రంగా రగిలించాలట. ఇందు కోసం సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానమాచరించాలి. ఇలా శుచిగా ఉన్న వ్యక్తి చేతనే భోగి మంటని వెలిగింపచేయాలి. అది కూడా కర్పూరంతో వెలిగిస్తే మంచిది.ఇక భోగిమంటల్లో వేసే వస్తువుల గురించి కూడా కాస్త జాగ్రత్త వహించాలి. ఒకప్పుడు భోగిమంటల్లో చెట్టు బెరడులు, పాత కలప వేసేవారు. ధనుర్మాసమంతా ఇంటి ముందర పెట్టుకున్న గొబ్బిళ్లను, పిడకలుగా చేసి భోగి మంటల కోసం ఉపయోగించేవారు. ఇవి బాగా మండేందుకు కాస్త ఆవు నెయ్యిని జోడించేవారు. ఇలా పిడకలు, ఆవునెయ్యితో ఏర్పడే మంట నుంచి వచ్చే వాయువులో ఔషధగుణాలు ఉంటాయని ఆయుర్వేదం చెబుతోంది. కానీ కాలం మారింది. రబ్బర్ టైర్లు, విరిగిపోయిన ప్లాస్టిక్ కుర్చీలని కూడా భోగిమంటల్లో వేస్తున్నారు. వాటిని భగభగా మండించేందుకు పెట్రోలు, కిరసనాయిల్ వంటి ఇంధనాలని వాడేస్తున్నారు.

**ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి భరత్, అధికారులు :** సంక్రాంతి పండుకు ఒక రోజు ముందు నిర్వహించుకునే పండుగ భోగి. భోగితో సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సూర్యుడు దక్షిణాయనం నుండి ఉత్తరాయన పుణ్యకాలంలోకి మారుతున్న తరుణంలో నిర్వహించుకునే సంక్రాంతికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. సంక్రాంతి నుండి పగటి పూట సమయం పెరుగుతుంది. రాత్రి సమయం తగ్గిపోతోంది. ఇప్పటి వరకు మనలను వణికించిన చలి తప్పుకుని వేడి పెరుగుతుంది. మెల్లగా వేసవి ప్రారంభమవుతుందన్న మాట. తెలుగు ప్రజలకు అతి పెద్ద పండుగ సంక్రాంతి. కొత్త పంటలు ఇంటికొచ్చే సమయం ఇది. అందుకే ఇది రైతుల పండుగ. కొత్త అల్లుళ్లతో... కోడి పందాలతో అంటూ సినీ గేయరచయిత రాసిన పాట ఇప్పటికీ సంక్రాంతి సందర్భంగా ఉత్సాహం రేపుతోంది. మూడు రోజుల పాటు ఆవుపేడతో చల్లే కళ్లాపితో భూమి తల్లికి ఆకుపచ్చ చీరకట్టేస్తారు. బియ్యం పిండితో ఆకాశంలోని చుక్కలను తెంచి భూమాతను అలంకరించారా అన్నట్లుగా వేసిన రంగు రంగుల ముగ్గుల మధ్యలో ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచి పూలతో అలంకరించి పండుగ చేసుకోవడం సాంప్రదాయంగా వస్తోంది. ఇక ముగ్గుల పోటీలు నిర్వహించడమూ పరిపాటిగా వస్తోంది. సంక్రాంతి సందర్భంగా పలు ఆలయాలను ముస్తాబు చేశారు. సంక్రాంతి రోజున గోదాదేవి, రంగనాథస్వామి కళ్యాణోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

# అపహరించబడిన బాలుడు క్షేమముగా లభ్యం..

- గుట్టు రట్టు అవుతుందని తల్లిదండ్రుల ఇంటి వద్దే బాలుడిని వదిలి వెళ్ళిన దుండగలు..
- నిందితుల కోసం గాలింపు చర్యలకు పోలీసులకు డీఎస్పీ ఆదేశం
- బాలుడు ఆచూకికి కృషి చేసిన పోలీసులను అభినందించిన కర్నూలు జిల్లా ఎస్పీ బిందు మాధవ్



ఆకాష్‌తో కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, తల్లిదండ్రులు



**కర్నూల్ క్రైమ్ మెజర్ న్యూస్ :**గత నెల 20 వ తేదీన కర్నూలు నాలుగవ స్టేషన్ పరిధిలో కిడ్నాప్ కు గురైన బాలుడి కథ ఎట్టకేలకు సుఖాంతం అయిందని, బాలుడు క్షేమంగా లభించాడని కర్నూలు డిఎస్పి జె. బాబు ప్రసాద్ తెలిపారు. బాలుడి తల్లిదండ్రులను ఆదివారం కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ కు పిలిపించి బాలుడిని వారికి అప్పగించారు. అనంతరం డిఎస్పి బాబు బాబు ప్రసాద్ పట్టణంలోని నాలుగో పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిల్లీ ప్రాంతం నుండి వచ్చి కర్నూల్ - కోడుమూర్ శివార్లలో గుడిసెలు వేసుకొని రోడ్డు పై పిల్లల బొమ్మలు అమ్ముకొని జీవించే అజిత్ రాథోడ్, అతని భార్య ఆశా, తన పిల్లలతో కలసి జీవిస్తున్నారు.గత నెల 20 వ తేదీన అర్ధ రాత్రి గుడిసెలో నిద్రిస్తుండగా వారి 8 నెలల చిన్న కొడుకు ఆకాష్ రాథోడ్ ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లుగా కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్లో బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందడంతో కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్ ఆధ్వ ర్యంలో కర్నూలు నగరం లోని పోలీసు అధి కారులందరూ బృందాలుగా ఏర్పడి విస్తృ తంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆవకా శం ఉన్న అన్నీ ప్రాంతాల లోని సీసీ కెమెరా లను పరిశీలించారు. అనుమానిత మొబైల్ నెంబర్ లను సేకరించి విచారిస్తూ, అనుమా నిత వ్యక్తులను తనిఖీ లు చేస్తూ, కర్నూలు జిల్లాతో పాటు కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల లో కూడా గాలింపు చర్యలు చేపట్టారని తెలిపారు.కిడ్నాప్ అయిన బాలుడు పోలీసు చర్యల పలితముగా గత రాత్రి సుమారు 11 గంటల ప్రాంతములో తప్పిపోయిన బాలుడు ఆకస్మికముగా తల్లి దండ్రుల ఇంటి కి దగ్గరలో క్షేమముగా కనిపించాడని పోలీసుల నిర్విరామ చర్యలు చేపట్టడముతో కిడ్నాప్ చేసిన వారు తమ గుట్టు బయట పడుతుందనే భయంతో కిడ్నాప్ అయిన పిల్ల వాడిని తన తల్లి దండ్రుల వద్దనే వదిలి పారిపోయినట్లు ప్రాథమికముగా తెలుస్తుం దని అన్నారు. తప్పిపోయిన బాలుడు తల్లిదం డ్రుల వద్దకు చేరుకోవడంతో జిల్లా ఎస్పీకి, కర్నూలు పోలీసులకు బాలుడి తల్లిదండ్రు లు , బంధువులు సంతోషం వ్యక్తం చేస్తూ తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారని అన్నారు. అయినప్పటికి కిడ్నాప్ చేసిన నిందితుల కోసం పోలీసులు తీవ్రముగా గాలింపు చర్య లు చేపట్టినట్లు మరియు కిడ్నాప్ అయినప్పటి నుండి ఈ రోజు వరకు నిర్విరామ దర్యాప్తు చేసిన కర్నూల్ నాలుగో పట్టణ సిఐ మధు సూధన్ గౌడ్ ని, ఎస్సై చంద్రశేఖర్ లను మరియు ఈ గాలింపు చర్యలలో భాగమయి న ఇతర పోలీసు అధికారులను కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ అభినందిం చినట్లు డి.ఎస్.పి తెలిపారు. బాలుడిని కిడ్నాప్ చేసిన నిందితులను త్వరగా పట్టు కొమ్మని సంబందిత పోలీసు అధికారులను కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్ ఆదేశించినట్లు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

## 30 సంవత్సరాల తరువాత విద్యార్థుల ఆత్మీయ కలయిక



టీచర్‌లను ఘనంగా సత్కరించిన విద్యార్థులు

**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్ల మండల పరిధి లోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 బ్యాచ్ కు చెం దిన పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థిని విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలి శారు. ముందుగా ఉపాధ్యా యులు నారాయణ రెడ్డి, పిచ్చుమ్ రాజ్, ఎచ్ ఎం మల్లికార్జున, సుదర్శన్ రెడ్డికి శాలువా లతో సత్కరించి, విద్యాబుద్ధులలో నేర్పిన ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ గతంలో విద్యార్థులకు చెప్పిన పాఠాలను, జరిగిన సంఘటనలను, మధుర జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకుంటూ తమ ఆనం దాన్ని పంచుకున్నారు. పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థులు తమ పాఠశాలకు బీరు వాను గుర్తుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరసింహ, శేషగిరి, శివశంకర్, సుబ్బయ్య, పరమేష్, కృష్ణవేణి, ఆదినారాయణమ్మ, వీరలక్ష్మి, మరో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# టీడీపీ సీనియర్ నేత భీమప్ప చౌదరి హఠాన్మారణం...



**ఆలూరు,మేజర్ న్యూస్ :** పెద్ద హెూతూరు గ్రామ టీడీపీ సీనియర్ నేత కుందనగుర్తి భీమప్ప చౌదరి ఆదివారం అనారోగ్యంతో హఠాన్మరణం చెందారు. ఆలూరు మండలంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కి ఆయన ఎంతగానో కృషి చేశారు. భీమ్మప్ప మృతి పట్ల టీడీపీ ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వీరభద్ర గౌడ్,వైకుంఠం శివ ప్రసాద్,మాజీ జడ్పిటిసి మీనాక్షి నాయుడు, వైకుంఠం మల్లికార్జున, ఎల్ ఎల్ సి డిసి ఛైర్మెన్ మిక్కిలినేని ప్రసాద్, వరదరాజులు, వెంకటేష్ చౌదరి,అశోక్ యాదవ్,రాం నాథ్ యాదవ్ లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భీమ్మప్ప మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. టీడీపీ కోసం తుది శ్వాస వరకు ఆయన పనిచేశారని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. భీమప్ప చౌదరి కుటుంబ సభ్యులకు వారు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. రేపు బళ్లారి లో అంత్యక్రియలను నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

# బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి సారా తయారికి సిద్దంగా ఉనన 2100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కిషోర్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని నాగలూటి గూడెం సమీప అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేస్తున్న బట్టీలపై దాడులు చేసి తయారికి సిద్దంగా ఉన్న 2100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. సారా తయారికి, రవాణ, విక్రయం చట్టరీత్య నేరమని, చట్టవ్యతిరేకమైన నాటుసారా తయారిని మానుకోవాలన్నారు. కాదనే ఎవ్వరైన సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు వారి వారి గ్రామాల్లో సారా నిర్మూలనకు కృషి చేయాలన్నారు. సారాకు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాధ్యతగల గ్రామ పౌరులుగా నాటుసార రహిత గ్రామాలుగా తీర్చదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ దాడుల్లో ఎస్ఐలు జగదీష్, కర్నూలు ఎసి ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ బిందు మాధవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అరచేతిలో అధునాతన వ్యవసాయ విజ్ఞానం

## - మండల వ్యవసాయ అధికారి

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** గ్రామీణ రైతులు చరవాణి ద్వారా వ్యవసాయానికి సంబంధించిన వాతావరణ, చీడ పీడల నివారణ చర్యలు, మార్కెటింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. రైతులు అందరూ వారి ఫోన్‌లలో అగ్రి యాప్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఆహార ధాన్యం, పండ్ల తోటలు, కూరగాయల సాగులో మొక్కలు నాటినప్పటి నుంచి వాటి పోషణ, సస్యరక్షణ, సకాలంలో పూత కాయ రావడానికి తీసుకోవాల్సిన చర్యలు, రవాణా, మార్కెటింగ్ సమాచారాన్ని సకాలంలో అందించడానికి ఈ సాంకేతికత తోడ్పడుతుందన్నారు. వాణిజ్య పంటలు, ఉద్యాన ఉత్పత్తులను, విదేశాలకు ఎగుమతి చేయాలని ఆశించే యువ రైతాంగానికి, దిగుమతికి అనువైన రకాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందడంలో ఈ సాంకేతికత సహాయపడుతుందని అన్నారు. రైతులు ఈ పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు వారికున్న సందేహాలను నిపుణుల ద్వారా నివృత్తి చేసుకోవచ్చని అన్నారు. అదే విధంగా కిసాన్ సువిద, పూసాకృషి, ఇస్కో కిసాన్, క్రాఫ్ట్ ఇన్స్యూరెన్స్, తదితర యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# తెదేపా సభ్యత్వ నమోదులో శ్రీశైలం నియోజకవర్గం మొదటి స్థానం



**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశే ఖర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని గొల్ల వీధి 103 బూ త్‌లో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని నిర్వహించి నట్లు పట్టణ టీడీపీ అధ్యక్షులు ఖలీలుల్లా ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో 65 వేల టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందని నంద్యాల జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. నియోజకవర్గంలో వెలుగోడు మండలంలో ఎక్కువ సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, తిమ్మయ్య, తిమ్మా రెడ్డి, హరి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా కోరల నుండి ఆలూరు చెరువును కాపాడండి : సిపిఎం నాయకులు..



ఆక్రమించిన చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

**ఆలూరు,మేజర్ న్యూస్ :** కబ్జా కోరల నుండి ఆలూ రు చెరువును కాపాడా లని సిపిఎం జిల్లా కార్య దర్శి వర్గ సభ్యుడు పి.హ నుమంతు ఆలూరు ప్రాం తీయ కమిటీ నాయకులు కృష్ణ, మైన ,ఈరన్న డి మాండ్ చేశారు .ఆది వా రం సాయంత్రం సిపిఎం బృందం ఆలూరు చెరువు లోని ఆక్రమణకు గురి అయిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావే శంలో వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 748లో 155.73 ఎకరాల విస్తీర్ణంలో ఉందని ఈ చెరువు గత పది సంవత్సరాల నుండి చెరువు నిండక పోవడంతో విస్తారమైన ఖాళీ స్థలం ఉండడంవల్ల భూ కబ్జాదారుల కన్ను పడిందని వారన్నారు.గత 15 సంవత్సరాల నుండి చెరువుకు సంబంధించిన స్థలములో ఇప్పటికే ఇల్లు దేవాలయాలు ఖాళీ స్థలం ఆక్రమించుకుని బండ్లు నాటడం జరిగిందని అన్నారు. 2022 సంవత్సరంలో మూడు ఎకరాల స్థలంలో చదును చేసుకుని గతంలో అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా ప్రజా సంఘాలు ,కమ్యూనిస్టు పార్టీ నాయకులు పోరాటాల వల్ల ఆక్రమణలను కాపాడడం జరిగిందన్నారు.అయితే గత రెండు మూడు రోజుల కిందట అధికార పార్టీ నాయకులు చెరువు స్థలంలో సరిహద్దు రాళ్లు వేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వారన్నారు. గతంలో మైనర్ ఇరిగేషన్ అధికారులు మొక్కుబడిగా వచ్చి ఆలూరు చెరువు ను కబ్జాదారుల నుండి కాపాడుతామని సర్వే చేసి చెరువు సరిహద్దు చుట్టూ కంచె వేస్తామని ప్రగల్బాలు పలికారే తప్ప ఇప్పటికి ఆచరణలో ఏమీ చేయలేదని అందుకోసం అధికార పార్టీ నాయకులు భూ కబ్జాదారులు రెచ్చిపోయి ఆలూరు చెరువు స్థలాలను ఇష్టానుసారంగా ఆక్రమించుకుంటున్నారని వారన్నారు. ఇప్పటికైనా మైనర్ ఇరిగేషన్ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చెరువులు సర్వే చేయించి భూ కబ్జాదారుల నుండి కాపాడాలని చెరువు స్థలాన్ని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఆలూరు చెరువును కాపాడాలని లేకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలను, రైతులను సమీకరించి తాసిల్దార్ కార్యాలయాన్ని, మైనర్ ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

సూర్య



# ప్రమాద అంచుల్లో.. అంగన్వాడీ భవనం

- ఏడేళ్లు గడవకముందే ప్రమాదకర స్థితిలో అంగన్వాడీ కేంద్రం








పెద్దకడుబూరు మండల పరిధిలోని జాలవాడీ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణం అప్పటి ప్రభుత్వం పి.ఐ.పి.ఎస్.డి.పి. నిధుల కింద రూ. 9.50 లక్షలు అంచనాల వ్యయంతో అంగన్వాడీ కేంద్ర భవనం నిర్మాణం పనులు చేపట్టింది. నిర్మాణం పూర్తి అయిన ఈ భవనాన్ని 2016 సంవత్సరం డిసెంబర్ నెల 19వ తేదిన అప్పటి రాష్ట్ర శాసనమండలి చైర్మన్ ఎ. చక్రపాణియాదవ్ రాష్ట్ర మంత్రులు. మంత్రాలయనియోజకవర్గం శాసన సభ్యులు వై. బాలనాగిరెడ్డి ప్రారంభించారు. ఈ భవనం నిర్మించి ఎనిమిది సంవత్స రాల గడవకముందే భవనం యొక్క గోడలు చుట్టూ పగుళ్ల ఏర్పడి నెర్రెలు చీలాయి. అంతేకాకుండా భవనం చుట్టుపక్కల సిమెంట్ పెచ్చులూడి పడుతున్నాయి. భవనం గదుల్లో వేసిన నాపరాతి బండలు కూడా కుంగి పోయాయని అంగన్వాడీ కార్యకర్తలు, అయాలు, పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ భవనం ప్రమాదకర స్థితిలో వున్నందున ఏప్పుడు ఏ సమయంలో ప్రమాదం ముంచుకోస్తోందోనని భయాందోళనకు గురవుతున్నారు. ముందు జాగ్రత్త చర్యగా అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలను మరొక భవనంలోకి మార్చడం జరిగిందని అంగన్వాడీ భవనం ప్రమాదకర స్థాయిలో ఉందన్న విషయం పై అధికారులకు కూడా తెలపడం జరిగిందని అంగన్వాడీ కార్యకర్తలు తెలిపారు. అయినా అధికారు లకు ప్రజాప్రతినిధులకు విషయాన్ని తెలియజేసిన కూడా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని,అంగన్‌వాడీ భవనాన్ని కనీసం చూడడానికి కూడా రాలేదని వారు తెలిపారు. అంగన్‌వా డీకు వస్తున్న చిన్న పిల్లలను ఈ భవనంలో కూర్చొబెట్టాలంటే ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న భయాందోళన ఉంటుందని తెలిపారు.భవన పరిస్థితి శిథిలవస్థలో ఉండడంతో చిన్న పిల్లల తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపించడానికి భయపడుతున్నారని తెలిపారు. కొన్ని ఏళ్ల పాటు పటిష్టంగా ఉండాల్సిన ప్రభుత్వ భవనాలు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల, అధికారుల అవినీతి నిర్లక్ష్యం వల్ల ఏళ్లు గడవక ముందే శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకర స్థితికి చేరుతున్నాయని చిన్న పిల్లల తల్లిదండ్రు లు,గ్రామస్తులు విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి జోక్యం కల్పంచుకొని జాలవాడీ గ్రామంలో ప్రమాద కరంగా ఉన్న అంగన్వాడీ భవనం కేంద్రానికి మరమ్మ తులు చేపట్టి వినియోగంలోకి తీసుకోవాలని గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు అధికారులను ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని విజయ వాణి పబ్లిక్ స్కూల్‌లో 2003 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు రాజ మల్లయ్య, నారాయణ మూర్తిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉన్నత స్థానాల్లో ఉండటం ఆనందంగా ఉందని అన్నారు. ఇలా కలుసుకోవడం అప్పటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నట్లుగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

## ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు... పోలీసులకు సమాచారం ఇవ్వాలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఇతర గ్రామాలకు, ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ప్రజలను కోరారు. విలువైన బంగారం, వెండి ఆభారాలు, నగదును మీ వెంట తీసుకెళ్లాలని లేదా బ్యాంకులో లాకర్లలో ఉంచుకోవాలని సూచించారు. ఇంటి భద్రతలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పోలీసులకు తెలియజేస్తే ఆ ప్రాంతాల్లో పోలీసుల గస్తీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పండుగ ఆఫర్లు అంటూ మొబైల్ ఫోన్‌లలో లింక్‌లు వస్తే ఓపెన్ చేయవద్దని అన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపడటం చట్ట రీత్యా నేరమని తెలిపారు. బస్సులో ప్రయాణించే సమయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సాంప్రదాయ క్రీడలు మినహా ఏ ఇతర కోడి పందాలు, జూదం, తదితర ఆటలు నిషేధమని తెలిపారు. ఎవరైనా నిర్వహించినా, ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బందికి, ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల రక్షణలో భాగంగా ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలో రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వారికి నేర పవృత్తికి స్వస్తి పలికి మంచి పౌరులుగా జీవించాలని కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరాతీశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని తెలిపారు. మీపై నిఘా ఉంటుందని పోలీసులు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

### ట్రక్కర్ లారీకి ఆటో డీ కోట్టడంతో..



మృతి చెందిన గొవిందరెడ్డి

**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** హొళగుందకు కిలో మీటర్ దూరంలో శ్రీరామ్‌నగర్ క్యాంఫ్ సమీపంలో ఆదివారం తెల్ల వారి జామున రోడ్డుపై నిలిచిన ట్రక్కర్ లారీ వెనక భాగంలో స్టేరింగ్ ఆటో డీకోట్టడంతో ప్రమాదంలో ముద్దటమాగి గ్రామానికి చెందిన గొవిందరెడ్డి (37) అనే వ్యక్తి మృతి చెందాడు.పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి కర్ణాటక ప్రాంతానికి చెందిన ట్రక్కర్ లారీని మార్లమడికి ప్రధాన రోడ్డు మార్గంలో రైస్ మిల్ వద్ద నిలిచి ఉన్న లారీ వెనక భాగంలో ఆటోలో వెళుతున్న గొవిందరెడ్డి లారీ వెనక భాగంలో డీ కోట్టాడు.ప్రమాదంలో వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు.లారీ డ్రైవర్ వెనక భాగంలో ఇండికేటర్ వేయకపోవడంతో చికటిలో లారీ కనపడకపోయేసరికి ఈ ప్రమాదం జరిందని పోలీసులు తెలిపారు.లారీ డ్రైవర్ తప్పిదమన్నారు.భార్య సుమిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు.శవాన్ని ఫోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

## వైసిపి కర్నూలు జిల్లా యాక్టివిటీ సెక్రటరీగా రమేష్



మాజీ ఎమ్మెల్యే కాటసానిని కలిసి పూలమాలతో సత్కరిస్తున్న దృశ్యం

**కల్లూరు మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఆక్టివిటీ సెక్రటరీగా ఓర్కల్ మండలం పాలకొల్లు గ్రామానికి చెందిన కె రమేష్ ను నియమించారు. ఆదివారం వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని కలిసి పూలమాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తనకు కేటాయించిన పదవికి తన వంతు న్యాయం చేయడానికి కృషి చేస్తానని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మళ్ళీ అధికారంలోకి తీసుకురావడానికి పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు



సిఐ వంశీధర్

**శిరివెళ్ల, మేజర్‌న్యూస్ :** శిరివె ళ్ల సర్కిల్ పరిధిలోని శిరివెళ్ల, రుద్రవరం మండ లాల్లో సంక్రాంతి పండుగ పురస్కరిం చుకుని కోడి పందాలు, పేకాట వంటి జూ దాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని ఎవరైనా జూదాలకు పాల్పడినా, ప్రోత్స హించినా వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని శిరివెళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వంశీధర్ తెలిపారు. సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే పోలీసులకు తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. శిరివెళ్ల సిఐ నెంబరు 9121101169 ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని అన్నారు.

# రైతుల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : వీరభద్ర గౌడ్


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న వీరభద్ర గౌడ

**దేవనకొండ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఉన్నటువంటి రైతన్నలు అభివృద్ధి చెందాలంటే అది కేవలం మన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్చార్జీ వీరభద్ర గౌడ అన్నారు.మండల ఫరిదిలోని కొత్తపేట గ్రామంలోని వీరేశ్,శివ అనే పాడి రైతులకు మంజూరు చేసిన గోకులం షెడ్డును ఆయన ఆదివారం యంపిడిఒ గౌరీదేవితో కలిసి పారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి రైతుల ప్రభుత్వం అని ప్రచారాలు చేసుకోవడం తప్ప రైతులను ఏ విధంగా ఆదుకోకపోగా రాష్ట్రంలో పాలనను భ్రష్టు పట్టించారని విమర్శించారు.నేడు మన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రాష్ట్ర అబివృద్ధికి కృషి చేస్తూనే మరో వైపు రైతులకు కావాల్సిన పరికరాలను సబ్సిడీ ద్వారా అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నాడని కొనియాడారు.అధికారం చేపట్టిన ఆరు నెలలలోనే అమరావతి,పోలవరంతో గ్రామాలలో సిసి రోడ్లు మరియు రాష్ట్రంలో ఎక్కడా గుంతల రోడ్లు కనిపించకుండా ఉండేలా నిధులు విడుదల చేయడం గర్వించదగ్గ విషయమన్నారు.ఇది కేవలం అభివృద్ధికి నాంది మాత్రమేనని రానున్న నాలుగేళ్లలో రాష్ట్రం రూపు రేకలు మారడం ప్రజలే చూస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బడిగింజల రంగన్న,ఈదులదేవర బండ సుభాన్,మల్లిఖార్జున గౌడ్,వెంకటస్వామి గౌడ్,ఆకుల వీరేశ్,కప్పట్రాళ్ల మల్లికార్జున,వెలమకూరు భాస్కర్,పొట్లపాడు బడేసాహెబ్,నాగేశ్వరావు,మస్తాన్,రాజసాహెబ్,చాంద్ భాష, పాల్గొన్నారు.

# వివాహాది శుభకార్యాలకు ఉచిత ప్లేట్లు పంపిణీ : బి.సి ఇందిరమ్మ

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** వివాహాది శుభకార్యాల కోసం ఉచిత ప్లేట్ల పంపిణీ కేంద్రాన్ని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ ఆదివారంనాడు ప్రరాంభించారు. నా బనగానపల్లె నా ఆరోగ్యం పేరిట పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత బనగానపల్లెగా తీర్చిదిద్దాలన్నా ఉద్దేశంతో బి.సి ఇందిరమ్మ గత మూడు నెలలుగా ఒక ఉద్యమం చేపట్టారు. ఈ ఉద్యమానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. ఇందులో భాగంగా తమ వంతుగా వివిధ శుభకార్యాలలో పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసుల వాడకాన్ని తగ్గించాలని పలువురు మహిళలు శుభకార్యాలకు ఉచితంగా స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దాతల సహకారంతో సేకరించిన ఉచిత పంపిణీ కేంద్రాన్ని ఇందిరమ్మను ఆహ్వానించి ఆదివారం ప్రారంభించారు. స్థానిక అమ్మవారిశాల ప్రాంగణంలో ప్లేట్ల పంపిణీ నిర్వాహకులు ఆదవేణి లక్ష్మి, మూల రామేశ్వరమ్మ, తిరిపే భాగ్యమ్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉచిత ప్లేట్లకు ఆర్థిక సహాయం చేసిన దాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను గత మూడు నెలలుగా చేపట్టిన ప్లాస్టిక్ రహిత బనగానపల్లె ఉద్యమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం పెద్దలు, దాతలు పాల్గొన్నారు. ఉచిత ప్లేట్లు కావాల్సిన వారు ఫోన్ నెం. 9441690735, 8885400100 మరియు 9951405039లను సంప్రదించాలని తెలిపారు.



ప్లేట్ల పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బి.సి ఇందిరమ్మ

# సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు : ఎస్ఎఫ్ఐ డిమాండ్




**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** సంక్రాంతి సెలవుల్లో ప్రైవేట్ పాఠశాలలు స్పెషల్ క్లాసుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తు న్నారని, ఆయా కళాశాలల, పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు అబూబాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాంకుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి తెస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న విద్యా సంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్నారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే విద్యాలయాల వద్దకు వెళ్లి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమాంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లేష్, ఆర్యన్, యోగి, పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఎస్పీ బదిలీని నిలిపివేయాలి

## రోపా జిల్లా కార్యదర్శి కోనేటి వెంకటేశ్వర్లు




**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** తిరుపతిలో జరిగిన ఘటనకు బాధ్యుడిని చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడుపై వేసిన బదిలీ వేటును వెంటనే వెనక్కు తీసుకోవాలని రాయల అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (రోపా) జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని రోపా కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోపా కన్వీనర్ కోనేటి చంద్రబాబు, పూర్వాధ్యక్షులు కొట్టే చెన్నయ్య మాట్లాడుతూ తిరుపతి తొక్కిసలాట ఘటనకు కారకులైన పెద్దలను వదిలేసి ఐపిఎస్ అధికారిపై బదిలీ వేయడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధికారిని యధాస్థానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం రోపా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

# ఎంఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు..

**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా ఎంఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో డోన్ పట్టణం నెహ్రూ నగర్ లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి క్యాంపు కార్యాలయం నందు ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఘనంగా ముగిశాయి.టీడీపీ యువనాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి,ధర్మవరం భరత్ రెడ్డి ల పర్యవేక్షణలో ఎం ఎస్ ఆర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో కొనసాగిన ముగ్గుల పోటీలకు నియోజకవర్గ పరిధిలో విశేష స్పందన లభించింది.పెద్ద ఎత్తున పోటీలో పాల్గొన్న మహిళల తో ఆ ప్రాంతమంతా పండుగ సందడి నెలకొంది. పోటీలలో మొదటి బహుమతి పొందిన కె.ప్రసన్నలక్ష్మి కి రూ.15వేలు పట్టణ టీడీపీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు అందచేయగా,రెండవ బహుమతి లక్ష్మీ రేణుక కు రూ.10వేలు నంద్యాల జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున,మూడవ బహుమతి గెలుపొందిన బి పావని కి రూ.7,500 చనుగొండ్ల కాశీ ,నాల్గవ బహుమతి గెలుపొందిన ఎస్ ఆదిలక్ష్మి కి రూ.5వేలు పట్టణ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సిటీ కేబుల్ కిరణ్,ఐదవ బహుమతి నిత్యశ్రీ కి రూ.3వేల రూపాయలు యాపదిన్నె కాశీ రెడ్డి లు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందచేశారు.




# వివేకానంద జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** యువతకు స్ఫూర్తి ప్రధాత భారతదేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన చైతన్యమూర్తి, తత్వవేత్త స్వామి వివేకానంద జయంతి (జాతీయ యువజన దినోత్సవం) సందర్భంగా ఉయ్యాలవాడ రేనాటి సూర్యచంద్రుల సమితి ఆధ్వర్యంలో వీరభద్ర స్వామి దేవాలయం ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. నంద్యాల బ్లడ్ సెంటర్ వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని 25 మంది గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసినట్లు సమితి ప్రతినిధి బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ సెంటర్ టెక్నీషియన్లు అంకన్న, హసీనా, సమితి సభ్యులు సుబ్బరాయుడు, అబ్దుల్ జిలానీ, జయచంద్ర, విశ్వ హిందూ పరిషత్ ఖండ ఉపాధ్యక్షులు ముసాని విశ్వనాథ్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ కంబల్ల మోహన్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వామివివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** స్వామివివేకానంద 162 వ జాతీయ యువ దినోత్సవ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం బేతంచర్ల పట్టణంలో బీజేపీ అనుబంధసంఘాల ఆధ్వర్యంలో భారీగా బైక్ ర్యాలీ కొత్త బస్ స్టాండ్ నుండి గాయత్రి సూపర్ మార్కెట్ వరకు నిర్వహించారు . అనంతరం పాత బస్ స్టాండులో డోన్ నియోజక వర్గ అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకట రమణ, వక్తగా శ్యాంబాబు ప్రసంగించారు. అనంతరం బీజేపీ యువమోర్చ అధ్యక్షునిగా కుంచెపు ధర్మారెడ్డిని ఏకగ్రీవంగా డోన్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నాగ మోహన్ రెడ్డి, రూరల్ అధ్యక్షులు దాదాగాల్లా ఆంజనేయులు ,అర్బన్ అధ్యక్షులు గుండా అశ్వర్థ నారాయణ సీనియర్ న్యాయవాది నందిపల్లె నారాయణ, కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు దూలం శివరామిరెడ్డి, రవి శంకర్ నాయుడు, చంద్ర శేఖర్ ,బాలరాజు, మునగాళ్ల రామ్ మోహన్,ఆర్య వైశ్య యూత్, హిందూ ధార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళం

**మహానంది, మేజర్‌న్యూస్ :** పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వమని, విద్యను అభ్యసించిన రోజులను గుర్తు చేసుకోవడం మధుర జ్ఞాపకాలు అని ఆనాటి ప్రధానోపాధ్యాయులు రామకృష్ణా పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు అపూర్వ కలయికను నిర్వహించారు. అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సహాలతో గడిపారు. పాఠశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు చదివిన విద్యార్థులలో మొట్ట మొదటిసారిగా ఈ విద్యార్థులు పూర్వ విద్యార్థుల కలయికను నిర్వహించారు. వీరికి విద్యను బోధించిన నాగశేషులు, రహీం ఖాన్, బాలసుబ్బమ్మ, ప్రేమలత, తదితర ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సూర్య



# అకౌంట్లో రూ.5 వేలు క్లిక్ చేస్తే అంతా ఖాళీ

**-సైబర్నేరగాళ్ల మరో కొత్త తరహా స్కామ్ కు తెర**

**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..**



మాట్లాడుతున్న సీఐ గంగాధర్

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** టెక్నాలజీ పెరగడంతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా స్కామ్లకు పాల్పడుతున్నారని అందులో బాగంగానే తాజాగా జంప్డ్ డిపాజిట్ స్కామ్ పేరుతో కొత్త మోసం వెలుగులోకి వచ్చిందని సీఐ గంగాధర్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ దీని ద్వార చాల మంది ప్రజలు భారీగా డబ్బు ను కోల్పోతున్నారని ఆయన అన్నారు. జింప్డ్ డిపాజిట్ స్కామ్ అనేది యూపిఐ వినయోగదారులను లక్ష్యంగా చేసుకొని వల పన్నుతున్నారన్నారు. నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల్లో రూ.5వేలు లేదా అంతకంటే ఎక్కువ జమ చేస్తారు. ఖాతా లో డబ్బు జమ అయినట్లు ఒక నోటిఫికేషన్ ఎస్ఎంఎస్ రూపంలో ఖాతాదారుడికి వస్తుంది. ఆ సమయంలో ఖాతాదారుడు బ్యాలెన్స్ చెక్ చేయడానికి యూపీఐ ఒపెన్ చేసి పిన్ నెంబర్ ఎంటర్ చేస్తే నేరగాడికి యాక్స్ అభిస్తుంది. దీంతో ఖాతా లో ఉన్న మొత్తం డబ్బు మాయమైపోతుంది.

**జంప్డ్ డిపాజిట్ స్కామున్ను ఎదుర్కోవడం ఇలా:** గుర్తు తెలియని నెంబర్ నుంచి మీ ఖాతాలో చిన్నమొత్తం జమ అయితే వెంటనే బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేయరాదు. 15 నిమిషాల నుంచి 30నిమిషాల వరకు వేచి చూడాలి.ఆ తర వాత స్కామర్ అభ్యర్థి గడువు ముగిసి పోతుంది. ఒకవేళ మీ ఖాతాలో డబ్బు జమ అయిన తరువాత బ్యాలెన్స్ చెక్ చేసుకేనే సమయంలో ఉద్దేశ్యపూర్వకంగానే తప్పు పిన్ ఎంటర్ చేయాలి. దీంతో స్కామర్ అభ్యర్థి క్యాన్సిల్ అవుతుంది అన్నారు. బ్యాంక్ బ్యాలెన్స్ను సంబందించిన యాప్తో నోటిఫికేషన్ లేదా మెసెజస్ వస్తే మీరు నేరుగా బ్యాంక్ ను సంప్రదించి మీ అనుమానాలను తీర్చు కోమును ఎప్పుడు మీ యూప్ పిచ్ నెంబరు ఇతరులకు షేర్ చేయవద్దు లేదా చెప వదన్నారు జంప్ డిపాజిట్ స్కామ్ కు సంబంధించిన కేసలు ఇటీవల చాల ఎక్కువవుతున్నాయి కాబట్టి ఇలాంటి తరహా మోసాలు గుర్తైతే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు పిర్యాదు చేయాలన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు



**ఆళ్లగడ్డ , మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ,ఆళ్లగడ్డ మండల శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని జయంతి (జాతీయ యువజన దినోత్సవం)కార్యక్రమము ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమం విశ్రాంత న్యాయమూర్తి కాశీభట్ల శివప్రసాద రావు గృహ ప్రాంగణంలో గల జగద్గురు ఆదిశంకరాచార్య దేవస్థానం (మినీహాల్ దగ్గర ) నందు జరిగింది. స్వామి వివేకానంద చిత్రపటానికి కాశిభట్ల శివప్రసాద్ పూలమాల వే సారు. వారుమాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని 1863 సంవత్సరంలో జన్మించి ఇప్పటికీ మనచే స్మరించబడటం లోనే ఆయన గొప్పతనం ఏమిటో అర్థం అవుతుందిఅని తెలిపారు ముఖ్య వక్తగా పాల్గొన్న రామకృష్ణ, విభాగ్ కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశం కీర్తి ప్రపంచ వ్యాప్తం చేసిన గొప్పవ్యక్తి అని తెలిపారు. నేటి యువతకు వారిచ్చే సందేశం" బలమే జీవనమని బలహీనత మరణమని 'తెలిపారనితెలిపారు. దరిద్రనారాయణ దేవోభవ అని చెప్పి పేదలకుసేవచెయ్యాలని తెలిపిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. స్వామి వివేకానంద ఉపన్యాసములుచే ప్రభావితం అయినవంటి స్వాతంత్ర్య పోరాటం చేసిన నేతాజీ ,గాంధీజీ మొదలగు వారు ఎందరో ఉన్నారనీ నేటి యువత వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి అని తెలిపారు . ఈ కార్యక్రమము లో జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీపతి,సంఘ నాయకులు,బుచ్చిబాబు, రామాంజనేయులు ,మల్లికార్జున రాజు యదుకుమార్ వెంకట రమేష్, హా రినారాయణ మొదలగు ఉపాధ్యాయులు , మ హిళలు కూడా పాల్గొన్నారు.

# వైసిపి జిల్లా అధ్యక్షుడిని కలిసిన వైసిపి మండల అధ్యక్షులు అట్లా గోపాల్ రెడ్డి



ఎస్వి మోహన్ రెడ్డిను కలిసిన అట్లా గోపాల్ రెడ్డి

**తుగ్గలి,మేజర్ న్యూస్ :** మండలం పరిధిలోని పెండేకల్ గ్రామానికి చెందిన వైయస్సార్సీపి మండల అధ్యక్షులు అట్లా గోపాల్ రెడ్డి ఆదివారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి ను , వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ కుమార్ రెడ్డి ను,మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. అట్లా గోపాల్ రెడ్డి కు గత రెండు రోజుల క్రితం వైఎస్ఆర్సిపి మండల అధ్యక్ష పదవి రావడం జరిగింది. దీంతో అట్లా గోపాల్ రెడ్డి స్థానిక మండల వైసీపీ నాయకులు తో కలిసి వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ కుమార్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మలను కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అట్లా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి అధికారం లో లేకపోయినప్పటికీ ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ముందుండాలని తమకు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ లు తెలియజేశారని, అందువల్ల టిడిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజల



మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ను కలిసిన అట్లా గోపాల్ రెడ్డి

సమస్యలను పరిష్కరించేందుకు వైఎస్ఆర్సిపి తరపున పోరాటాలు చేసినందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రాంపల్లి నాగభూషణ్ రెడ్డి, రామ్ కొండ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు కారం భోగేశ్వర్ రెడ్డి, బసిరెడ్డి, దివాకర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మామిదాలపాడులో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**కర్నూల్, నగరంమేజర్ న్యూస్ :** రాంభూపాల్ చౌదరి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ పరిదిలోని 38వ వార్డు మామిదాలపాడులో సంక్రాంతి పురస్కరించుకుని సంభరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పురస్కరించుకుని సొసైటీ అధ్యక్షుడు వై.రామేశ్వరరెడ్డి అధ్యక్షతనఆదివారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మహిళలు రంగవల్లులను ఆకాశాన్నితాకే విధంగా ముగ్గులు వేసారు. ముఖ్యఅతిథిగా నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు హాజరై ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి సరిత (రైస్కుక్కర్), రెండవ బహుమతి మంజుల(మిక్సి), మూడవ బహుమతి కే.లత(దోసెల పెన్నం)లను కమిషనర్ అందజేశారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సొసైటీ అధ్వర్యంలో మహిళలను ప్రొత్సహించే విధంగా ముగ్గుల పోటీల నిర్వహించడం గర్వకారణమన్నారు. పోటీలలో చుక్కలు పెట్టి ముగ్గులు వేస్తేనే ఆ ముగ్గులకు ఒక ఆకారం వస్తుందన్నారు. కొందరు చుక్కలు లేకుండ కేవలం డ్రాయింగ్ వేసినట్లుగా ముగ్గులు వేస్తున్నారని. అయితే సంక్రాంతి అంటేనే చుక్కలు ముగ్గులకు ప్రత్యేకమన్నారు. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి ముగ్గులపోటీలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఈ.మహేశ్వరరెడ్డి, ఏ.సాంభశివరావు, ఆదిత్యరెడ్డి, సురేంద్రగౌడు, కర్నూలు భాష, ప్రసాద్, సుంకులమ్మ, మున్నాభాష తదతరులు పాల్గొన్నారు.



# సీనియర్ వైసీపీ నాయకుడు మృతి



నివాళులు అర్పిస్తున్న వైసీపీ నాయకులు

**చాగలమర్రి , మేజర్ న్యూస్ :** మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు ఎర్రోల్ల చిన్న ఓబులేసు (77) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైసీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్రెడ్డి లు గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించి,మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. సంతాపం తెలిపిన వారిలో గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవి,వైసీపీ నాయకులు రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి రమణ, గణేష్రెడ్డి,చిన్నిరెడ్డి,తదితరులు ఉన్నారు. చిన్న ఓబులేష్ వివిధ ప్రజా సంఘాల్లో పనిచేయడంతో దళిత సమైక్య నాయకురాలు ఎద్దుల మాణిక్యమ్మ, మాల మహానాడు మండల కన్వీన, కమటం నాగేష్, ప్రభు కాంతయ్య, ఇండ్ల శ్రీనివాసులు, పలు సంఘాల నాయకులు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తపరిచారు.

# బేస్ బాల్ టోర్నమెంట్ విజేత ఖాజా టీమ్



**ఓర్వకల్లు,మేజర్ న్యూస్ :** బేస్ బాల్ టోర్నమెంట్ విజేతగానన్నూరు గ్రామానికి చెందిన బైరెడ్డి కాలని కాజాటీమ్ నిలిచింది. ఆదివారం మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బేస్ బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి నాయకులు విశ్వేశ్వర రెడ్డి, మోహన్ పటేలా హాజరై ప్రారంభించారు. మొదటి విజేతగా గెలుపొందిన జట్టుకు 12 వేల రూపాయలను దాత టిడిపి నాయకులు మోహన్ పటేలా అందజేశారు. రెండవ బహుమతిని రెండవ విజేత ఓర్వకల్లు టీమ్ కు దాత అఫ్రోజ్ ఏడు వేల రూపాయలను అందజేశారు. మూడో బహుమతిని ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాజామియ్య, కరీం ఖాన్, హుస్సేన్ సర్కార్, చంద్రశేఖర్ రెడ్డి, వడ్ల భాష, బుజ్జప్ప శ్రీపతి టిడిపి నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# అపూర్వ కలయిక.. ఆనంద హేళ

**★ వైభంగా 75వ ప్లాటీనం జూబ్లీ వేడుకలు ★ గురువులకు ఘన సన్మానం**

**★ ఆనందంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వపు విద్యార్థులు**



**ఎమ్మిగనూరు మేజర్న్యూస్ ప్రతినిధి :** వేదిక ఒక్కటైంది.. అందరినీ కలిపింది..ఆనందాన్ని పంచింది.. ఆ అపూర్వ కలయికతో పాత గుర్తులు గుర్తు చేసుకుంటూ తీపి కబురులతో చట్టా పట్టాల వేసుకున్నారు. చదువులు చెప్పిన గురువులకు పాదాభివందనాలు చేశారు. ఘనంగా సన్మానాలు, సత్కారాలు చేశారు పూర్వపు విద్యార్థులు. ఇంతటి ఆనందాన్ని ఎమ్మిగ నూరు జాతరకు మూడు రోజుల ముందు ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా 75వ వసంతాల వేడుకను కనువిందుగా జరుపుకున్నారు పూర్వపు విద్యార్థులు. అదివారం జరిగిన కళాశాల ప్లాటీనం వేడుకల్లో కళాశాలలో విద్యను అభ్యశించిన ఎందరో ఉద్యోగులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు ఇతరాత్ర రంగాల్లో వారు పెద్ద ఎత్తుల వేడుకలకు తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు ఎమ్మిగనూరు పితామహుడు పద్మశ్రీ మాచాని సోమప్ప విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయటదేరి జూనియర్ కళాశాలకు చేరుకున్న పూర్వపు విద్యార్థులు వారికి చదువులు నేర్పిన గురువులకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. వేదికపై నుండి మాచాని రఘునాథ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డిల చేతులు మీదుగా శాంతి కపోతాలు ఎగరవేశారు. జ్యోతిప్రజ్వలన అనంతరం వేదికపై పలువురు వారివారి తీపి గుర్తులను పంచుకున్నారు. సాయంత్రం వరకు ఈ అపూర్వ కలయికలో వారివారి అనుభవాలు పంచుకున్నారు. 75 ఏళ్లుగా ఇక్కడ విద్యను అభ్యసించిన విద్యార్దులు, అద్యాపకులు కలుసుకొని ఆనంద బాస్పాలతో ప్లాటీనం వేడుకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మిమిక్రీ ఆర్టీస్టులు, కళాబృందాల నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

## భారత దేశ ఖ్యాతిని చాటి చెప్పిన మహనుభావుడు స్వామి వివేకానంద

**పత్తికొండ టౌన్, మేజర్ న్యూస్ :** భారతదేశ ఖ్యాతిని చాటి చెప్పిన ఘనత స్వామి వివేకానందకు దక్కిందని బిజెపి అసెంబ్లీ కో-కన్వీనర్ గోవర్ధన్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి యవత కృషి చేయాలని, యవత వివేకానందుడి అడుగు జాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్సభ్యుడు దండి మల్లికార్జున, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యాయడు గోరంట్ల, ఓబిసి మోర్చా పట్టణ కార్యదర్శి కరణం చంద్రన్న, బిజెవైఎం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరణం నరేష్లు పేర్కొన్నారు.

# చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

**పాములపాడు మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని ఎర్ర గూడూరు గ్రామంలోని సుంకులమ్మ గుడి లోని హుండీ డబ్బులు సుమారు 15 వేల రూపాయలు ఈనెల 8వ తేదీన చోరీకి గురయ్యాయి చోరీ చేసింది ఆత్మకూర్ పట్టణానికి చెందిన ఖాదర్ బాషా గా పోలీసులు గుర్తించారు భానుముక్కల టర్నింగ్ వద్ద పోలీసులు చోరీ చేసిన వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుండి 15,200 రికవరీ చేసినట్లు ఎస్సై సురేష్ బాబు తెలిపారు.

# చంద్రబాబు విజన్‌తోనే గ్రీన్ కో ప్రాజెక్ట్

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :**
కర్నూల్ జిల్లాలోని ఓర్వకల్లు మండలం పిన్నాపురం దగ్గర నిర్మించిన గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు దేశానికే తలమానికమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఈ మేరకు మంత్రి ఒక ప్రకటన ద్వారా వివరాలు తెలిపారు. ఈ ప్రాజెక్టును 2014లో తమ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనకున్న ముందు చూపుతో రాష్ట్రానికి తీసుకువచ్చారని తెలిపారు. 2018లో గ్రీన్ కో ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్.. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుందన్నారు. సీఎం చంద్రబాబు విజన్ కు ఈ ప్రాజెక్టు ఒక నిదర్శనం అన్నారు. అయితే ఇప్పుడు కొందరు వ్యక్తులు ఈ ప్రాజెక్టు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజన్ అని చెప్పడం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. నిజం చెప్పాలంటే గత వైసీపీ గవర్నమెంట్ ఈ ప్రాజెక్టు విషయంలో ఎన్నో ఇబ్బందులు సృష్టించిందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పలు అనుమతులు ఇచ్చేందుకు వైసీపీ ప్రభుత్వం ఎంతో జాప్యం చేసిందన్నారు. గ్రీన్ కో ప్రాజెక్టును సరైన విధంగా ముందుకు తీసుకువెళ్లాలన్న ఆలోచన కూడా వైసీపీకి లేదన్నారు. ప్రజలందరికీ వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి టీజీ భరత్ అన్నారు. అప్పటి జీవో కాపీని చూస్తే విషయం అందరికీ తెలుస్తుందన్నారు. 2018 లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే గ్రీన్ కో ప్రాజెక్టుకు అడుగులు పడ్డాయన్నారు.

# చిన్ననాటి నేస్తం.. చిరకాల నేస్తం..

**ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...**

**గడివేముల మేజర్ న్యూస్ :** మండలంలోని కొరట మద్ది గ్రామంలో ఆదివారం నాడు గ్రామంలో 90 సంవత్సరాల క్రితం ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు చదివిన పూర్వపు విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదివిన దాదాపు 300 మంది పూరవు విద్యార్థులు కుటుంబ సభ్యులతో పాల్గొని ఆనందంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాలను చూసి గత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒక్కొక్క స్నేహితుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి విందులో భోజనం చేశారు. అనంతరం కొర టమద్ది గ్రామ పాఠశాలలో చదివి 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తొలి స్నేహితులకు, ఉద్యోగులు, వ్యాపారస్తులకు, రాజకీయ నాయకులకు, రైతులకు పూలమాలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేశ్వర్లు, రీఛార్జ్ చీఫ్ సైంటిస్ట్ నారాయణరెడ్డి, మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ సుశీలమ్మ, వాసుదేవ రెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్, పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కర్నూల్ గ్రామ పెద్దలు తిరుపెం రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, అయ్యప్ప రెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# వైసిపి ప్రభుత్వం లోనే గ్రీన్ కో ప్రాజెక్ట్ ఆవిర్భావం

**కల్లూరు మేజర్ న్యూస్ :** గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే గ్రీన్ కో పరిశ్రమ ఆవిర్భవించిందని వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకం కాదని శనివారం పాణ్యం నియోజకవర్గంలోని పిన్నాపురం పవర్ ప్రాజెక్టు సందర్శించడానికి వచ్చిన కూటమి ప్రభుత్వం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 2021లో పరిశ్రమ ఏర్పడిందని ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆయాంలో ఇండస్ట్రీస్ వెళ్లిపోయాయని ప్రచారం చేశారు కానీ రెండు సంవత్సరాల కాలంలోనే పవర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి పూర్తిచేసుకుని దేశంలోనే అతి పెద్ద పవర్ ప్రాజెక్టుగా నిలిచిందని వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిశ్రమలకు ఎప్పుడు వ్యతిరేకం కాదని నేను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో రైతులతో మాట్లాడి ప్రాజెక్టుకు ఇబ్బందులు లేకుండా చూసామని కేవలం నీ చేతగానితనంతో మాపై అక్కసు వెళ్లగక్కుతూ ఎన్నికల ముందు నాపై కబ్జారోపణలు చేశారని మీ దగ్గర ఆధారాలు ఉంటే నిరూపించాలని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కోరుతున్నది ఒక్కటే 212 సర్వే నెంబర్లు రైతులకు పరిహారం ఇస్తామని కంపెనీ వారు హామీ ఇచ్చారని ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన ఆ రైతులకు పరిహారం ఇప్పించాలని కోరుతున్నామన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో సోలార్ పార్కుకు మాత్రమే అనుమతులు ఇచ్చారని వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో మిగతా ప్రాజెక్టుకు, అటవీకి సంబంధించిన అనుమతులను ఇప్పించడం జరిగిందని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడే గీన్కో పవర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందని సోలార్ పార్క్ ఎన్ని రోజుల్లో నిర్మాణం జరిగింది, గ్రీన్ కో పవర్ ప్రాజెక్టు ఎన్ని రోజుల్లో నిర్మాణం జరిగిందో ప్రజలు అందరు గమనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కర్నూలు అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు మరియు వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ముగ్గుల పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముగ్గుల పోటీలను,గాలిపటం ఎగరవేయు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముగ్గులు వేసే మహిళలకు, గాలిపటాలు ఎగరవేసే యువకులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ముగ్గుల పోటీలు, గాలిపటం ఎగరవేయు పోటీలలో మంచి ప్రతిభ కలిగిన విజేతలకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోదరి డాక్టర్ వసంత, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ సుజాత లు బహుమతుల ప్రధానం చేశారు. ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి సాధించిన పాలసాగరనికి చెందిన జ్యోతికి, రెండవ బహుమతి సిరివెళ్ల మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి,మూడవ బహుమతి ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన భారతికి అందజేశారు. అలాగే గాలిపటం ఎగరవేసే పోటీల్లో మొదటి బహుమతి సాధించిన నంద్యాల పట్టణానికి చెందిన సాయి కార్తీక్ రెడ్డికి,రెండవ బహుమతి ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన సురేంద్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చింతకుంట్ల రామశేఖర్ రెడ్డి, చింతకుంట హర్షవర్ధన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతుల అభ్యున్నతి కోసమే మినీ గోకులాలు

**చాగలమర్రి , మేజర్ న్యూస్:** పాడిరైతుల అభ్యున్నతి కోసమే కూటమి ప్రభుత్వం మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టిందని టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహా రెడ్డి తెలియజేసారు. ఆదివారం మండలంలోని చక్రవర్తులపల్లె,బ్రాహ్మణపల్లె గ్రామాలలో మినీ గోకులాలను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో రూ 7.50లక్షల ఉపాధి నిధులతో 3 మినీ గోకులాలను ఏర్పాటు చేసారు. చక్రవర్తులపల్లె లో మినీ గోకులాన్ని మండల కన్వీనర్,టిడిపి నాయకులు రమణారెడ్డి బ్రాహ్మణపల్లెలో పంచాయితీ కార్యదర్శి చిన్నబ్బి గోకులాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడిపరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాడి పెంపకం ఎంతో లాభదాయకమన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సాయిబాబా, ఏపిఓ నిర్మల,ఈసీ వెంకటన్న,టిఏ బాలనాయక్,లబ్ధిదారులు హేమలత,రఘురామి రెడ్డి,శంకరమ్మ,టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# ఉన్నత అధికారిణి అండ.. ఉత్తమ అవార్డుకు ఎంపిక..!!

- ★ విస్తూపోతున్న మహిళ సంఘాలు
- ★ మహిళ శాఖలో అక్రమాల పుట్టా..?
- ★ అధికార పార్టీ నేతల మాటలు లెక్కచేయని జిల్లా ఉద్యోగి
- ★ ఒక్కరికే ఎన్ని రాయితీ రుణాలు..?
- ★ తొలగించిన మహిళ అధ్యక్షురాలికి కేంద్రంలో గుర్తింపా..!

**ఎమ్మిగనూరు టౌన్,మేజర్‌న్యూస్ :** వడ్డించేవారు మనవారు అయితే ఏ బంతిలో కూర్చున్న మంచి భోజనం లభిస్తుందని పెద్దలు చెప్పిన సామేతా.. ఆ సామేతకు అచ్చు వచ్చినట్టుగా జిల్లాలో ఓ మహిళ శాఖ అధికారినీ ఆమె అనుకున్న వాళ్లకి ఏమి చేయాలో.. ఎలా ఇవ్వాలో బంగారు పళ్లెంలో పెట్టి అలా ఇచ్చేస్తుంది అంతే. జిల్లాలో అనేక మహిళ సంఘాలు ఉన్న పట్టుమని పది మందికి కూడా స్వతహాగా ఉపాధి చూపించని ఓ మహిళకు రాయితీ రుణాలు అందించడంతో పాటు ఏకంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు దక్కేలా చేయడంలో తనకు తానే దిట్టా అని నిరూపించుకుంది. దీంతో జిల్లా మహిళా లోకం విస్తూపోయే పరిస్థితి నెల కొంది. మహిళ సంఘాలు సైతం ఆ జిల్లా అధికారినీ వ్యవహారశైలి పట్ల పలుమా ర్లు వార్తలోకి ఎక్కించారు. అయిన ఆ అధికారినీలో మార్పు రాలేదు అన్నది ఇటీవల ఓ మహిళను కేంద్ర అవార్డుకు ఎంపిక చేయడం ఆ అధికారినీ వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. ఆ అధికారినీ మండల స్థాయి అధికారి అయితే జిల్లా స్థాయి అధికారినీగా గత ప్రభుత్వంలో నుండి చలామణి అవుతూ వస్తుంది. ఆ ప్రభుత్వంలో ఉన్న మహిళలకు కూటమి ప్రభుత్వం వచ్చి 7 నెలలు గడిచిపోయి న ఆమెలో మార్పు రాకపోవడంతో ఏకంగా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో మహిళ శాఖా అధికారినీ వ్యవహారశైలి నచ్చక సంబంధిత శాఖ మంత్రులకు కూడా స్థానిక ప్రజా ప్రతినిధులు బదిలీ వేటు వేయాలని కోరినట్లు తెలుస్తోంది.



జిల్లాలో ఎన్నో మహిళ సంఘాలు ఉన్న ఎమ్మిగనూరు మహిళ సంఘంల్లో పని చేసిన పాతవారిపై ఆ అధికారినీకి చాలా మక్కువ ఎక్కువ ఉన్నట్లు తెలియ వచ్చింది. జిల్లాలో మహిళ సంఘాలకు రాయితీ రుణాల పేరిట ప్రాజెక్టులు రూపకల్పన చేసి అవి నిర్వీర్యం అయ్యేలా చేసిన ఘనత కూడా ఆ అధికారినీకి ఉన్నట్లు సమాచారం. ఎమ్మిగనూరు పట్టణంలో ఒకరూ కిందిస్థాయి ఉద్యోగిని విధుల్లో ఉంటే ఆ స్థానంలో తన వ్యక్తులను విధుల్లో ఉంచడంపై పట్టణ మహిళలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గతంలో ఉన్న ఓ మహిళ నాయకురాలికి సంబధించిన వ్యక్తిని పెట్టి ఆ కార్యాలయంలో ప్రతి విషయాన్ని రాబట్టుకుంటుంది. అక్కడితో ఆగక అక్కడ ఉన్న కిందిస్థాయి అధికారులను బెదిరింపులకు గురి చేస్తూ వస్తున్నాయన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఎమ్మిగనూరులో ఓ మహిళ నాయకురాలికి రాయితీ రుణాలు ఇప్పించడంతో ఆమెకు ఆమె దిట్టా అని నిరూపించుకుంటుంది. గతంలో ఓ రాయితీ రుణం ఇచ్చి తినుబండరాలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు అప్పటి అధికారులు. మరోసారి ఓ మినీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు రాయితీ రుణం అందించినట్లు ఆ శాఖా నివేధికలోనే తెలుస్తోంది. మరో రాయితీ రుణం భారీ ఎత్తున లక్షల్లో అందించి ఆ మహిళ నాయకురాలి రుణం తీర్చుకుంది. ఇలా రాయితీలు, రాయితీలు పొంది పట్టణంలో ఓ మహిళ అందలం ఎక్కుతుందికానీ మిగిత మహిళ సంఘాలు నిర్వీర్యం అవుతూ వస్తున్నాయి. ఇలా రాయితీ పోందిన వ్యాపారాల్లో ఉపాధి కూడా సక్రమంగా చూపించకపోయిన ఆ నాయకురాలికి జిల్లా అధికారి అండదండలు ఉన్న నేపథ్యంలో ఏకంగా కేంద్ర ప్రభుత్వం అందించే అవార్డుకు ఎంపిక చేసింది. మహిళ సంఘంలో మహిళలకు ఓ వ్యాపారం సృష్టిస్తానని దాదాపు లక్షల రూపాయలు వసూలుచేసి గత ప్రభుత్వ హయాంలో అనుకున్న వ్యాపారం శ్రీకారం చుట్టలేకపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక ఆ మహిళ వసూలు చేసిన మెత్తం సోమ్మును ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రజా ప్రతినిధి ఎమ్మిగనూరు మహిళా లోకానికి సోమ్ములు రీకవరి చేసి మెప్పు పొందారు. అలాంటి మహిళ నేత కేంద్ర ప్రభుత్వం అందించే అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఇటు అధికార పార్టీలోనూ, అటు జిల్లాలోని ఆయా మహిళ సంఘాల్లోనూ అలజడి సృష్టిస్తుంది. అయితే ఆ అధికారినీని కిందిస్థాయి ఉద్యోగి అమాత్యుల దగ్గర పలుకుబడి ఉపయోగించి కాపాడుతునట్లు సమాచారం. ఇది ఇలా ఉండగా ఓ మండల స్థాయి అధికారి జిల్లా స్థాయి అధికారిగా మహిళా లోకాన్నే ముంచేస్తూ వస్తుందని జిల్లా మహిళా సంఘాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి.

సూర్య



## మాజీ సైనికుని 'ఉసురు తీసిన'

# నంద్యాల మున్సిపాలిటి



కార్గిల్ యోధుడు దౌలత్ ఖాన్ (ఫైల్‌పోటో )

- ఆరు నెలలు దాటినా లభించని ఇంటి పన్ను మినహాయింపు
- కార్యాలయం చుట్టు తిరిగి తిరిగి అక్కడే వదిలిన ప్రాణం
- మున్సిపాలిటీలో గాడి తప్పిన పాలన!
- ఇంతకు తప్పెవరిది !
- మున్సిపల్ నిర్లక్ష్యానికి చిన్నబోయిన 'కార్గిల్ యోధుడు'







సైనికులతో దౌలత్ ఖాన్ (ఫైల్‌ఫోటో)



దౌలత్ ఖాన్ కొనుగోలు చేసిన ఇల్లు



**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** సైనికుడిగా దేశానికి సేవలు అందించాడు. గాలి అనక, చలనక, ఎండలను లెక్క చేయకుండా దేశ సరిహద్దులో శత్రువుల నుంచి భారతదేశ ప్రజలను కాపాడిన సైనికుడు నంద్యాల మున్సిపాలిటి నిర్లక్ష్యానికి ప్రాణం వదిలారు. కార్గిల్ యుద్ధ సమయంలో వీరోచితంగా పోరాడిన హవాల్దార్ దౌలత్ ఖాన్ నంద్యాల మున్సిపాలిటి నిర్లక్ష్యానికి చిన్నబోవాల్సి వచ్చింది. ప్రభుత్వం మాజీ సైనికులకు ఇంటి పన్ను మినహాయింపును ఇస్తుంది. ఇందు కోసం దౌలత్ ఖాన్ కార్యాలయం చుట్టు తిరిగి తిరిగి అక్కడే ప్రాణాలు వదిలిన విషయం పాఠకులకు విధితమే. ఇంటి పన్ను మినహాయింపు కోసం ఆరు నెలలు పూర్తయిన మినహాయింపును మాత్రం పొందలేకపోయారు. మున్సిపాలిటిలో గాడి తప్పిన పాలన మాజీ సైనికుడి ఉసురును తీసింది. దౌలత్ ఖాన్ విషయంలో తప్పెవరిదన్న దానిపై మేజర్‌న్యూస్ సేకరించిన వివరాల్లో విస్తు గోలిపే అంశాలు వెలుగు చూశాయి. పన్ను మినహాయింపు కోసం నంద్యాల మున్సిపల్ కార్యాలయంతో పాటు సచివాలయం చుట్టు తిరిగి అలసిపోయాడు. పన్ను మినహాయింపును ఇవ్వా లని కనిపించిన ప్రతి ఒక్కరిని ప్రాధేయపడ్డారు. ఆరు నెలలు దాటినా మినహా యింపు రాకపోవడంతో చివరకు అనారోగ్యానికి గురి కావాల్సి వచ్చింది. చివరిసా రిగా మున్సిపాలిటికి వెళ్లి తీవ్ర ఒత్తిడికి గుర్తైన దౌలత్ ఖాన్ మున్సిపాలిటిలోని రెవెన్యూ విభాగం ఎదుటనే కన్ను మూశారు.

**వివరాల్లోకి వెళ్లితే...**

దౌలత్ ఖాన్‌కు భార్య టి. రబీయ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇందులో ఇద్దరికి వివాహం కాగా, మరొకరు షలినా తల్లిదండ్రులకు తోడుగా ఉన్నారు. దౌలత్ ఖాన్ పఠాన్ కోట్, జమ్ము కాశ్మీర్ తదితర ప్రాంతాల్లో వివిధ విభాగాల్లో పని చేసి పదవి విరమణ చేశారు. సైనికుడిగా పదవి విరమణ చేసిన సమయంలో దౌలత్ ఖాన్ పొరుగున ఉన్న ప్రాంతాలలో ఉన్నారు. ఆదోని, హోళగుంద తదితర ప్రాంతాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన విధులను నిర్వహించారు. కొన్ని సంవత్సరాల క్రితం నంద్యాలకు వచ్చిన ఆయన పదవి విరమణ తర్వాత వచ్చిన డబ్బుతో నంద్యాలలోని జగజ్జనని నగర్‌కు సమీపంలో ఒక ఇంటిని కొనుగోలు చేశారు. భార్య, చివరి కుమార్తె షరినాతో కలసి నివాసం ఉంటున్నారు. మిగిలిన ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశారు. 2023వ సంవత్సరంలో ఆయన జగజ్జనని నగర్‌లో ఇంటిని కొనుగోలు చేశారు. మాజీ సైనికులకు ప్రభుత్వం కల్పించే పన్ను మినహాయింపు కోసం నంద్యాల మున్సిపాలిటిలో ధరఖాస్తు చేసుకున్నారు. 2024 జులైలో కౌన్సిల్ అజెండాలో ఆయనతోపాటు మరో ఏడుగురు సైనికులకు పన్ను మినహాయింపుపై ఆమోదం లభించింది. 2024 మార్చిలో కొనుగోలు చేసిన ఇంటిపై ఉన్న పన్ను బకాయిలను దౌలత్ ఖాన్ చెల్లించారు. కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత నంద్యాల మున్సిపాలిటి ఇందుకు సంబంధించి ప్రొసిడింగ్స్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటికే సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో నంద్యాల మున్సిపాలిటిలో సాధారణ బదిలీలు జరిగాయి. పన్ను మినహాయింపును రెవెన్యూ విభాగంలోని ఏ -1 క్లర్కు చూస్తారు. ఆ సమయంలో యుగంధర్ ఏ -1గా నిర్వహిస్తూ ఆగష్టులో ఆర్‌ఐగా చేరారు. ఏ-1 స్థానంలోకి జిలాని వచ్చి చేరారు. సీనియర్ అసిస్టెంట్ అయిన జిలాని ఆర్‌ఓగా కొన్ని రోజులు విధులు నిర్వహించారు. ఆర్‌ఓగా ఆంజనేయులు రావడంతో జిలాని ఏ-1గా విధులు నిర్వహిస్తున్నారు. కౌన్సిల్ ఆమోదం పొందినప్పటి నుంచి కార్యాలయం చుట్టు తిరిగినా ఆయన అనారోగ్యం బారిన పడినట్లు తెలుస్తోంది. కోలుకున్న తర్వాత తిరిగి కార్యాలయం చుట్టు తిరిగారు. గత శుక్రవారం చిన్నకుమార్తె షరీనాతో కలసి కార్యాలయానికి వెళ్ళారు. ఆ రోజు నంద్యాల మున్సిపల్ కార్యాలయానికి కమిషనర్ నిరంజన్‌రెడ్డిపై డీజల్ డీలర్ వెంకటేశ్వర్లు చేసిన అవినీతి ఆరోపణలపై ఆర్‌డి విశ్వనాథం విచారణ చేపట్టారు. దౌలత్ ఖాన్ కార్యాలయానికి వెళ్లినప్పుడు ఆర్‌ఐ యుగంధర్ ఉండటంతో తన పని నిమిత్తం సంప్రదించారు. ప్రస్తుతం ఆ సీట్‌లో తాను లేనని ఏ-1 వచ్చిన తర్వాత సంప్రదించాలని చెప్పారు. ఆ సమయంలో దౌలత్ ఖాన్ కాళ్ళు పట్టుకుంటానని తన పని చేయాలని యుగంధర్‌ను కోరారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన సీటులో తాను లేనని ఏ -1 సీటు ఉద్యోగి వచ్చిన తర్వాత కలవాలని ఆయనను సముదాయించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత జిలాని కార్యాలయానికి వచ్చారు. ఉదయం నుంచి అక్కడే ఉన్న దౌలత్ ఖాన్ జిలాని వచ్చిన తర్వాత ప్రొసిడింగ్స్ కోసం అభ్యర్థించారు. ప్రస్తుతం కార్యాలయంలో బిజీగా ఉన్నామని ఉన్నతాధికారుల విసి జరుగుతుందని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో దౌలత్ ఖాన్ తీవ్ర ఒత్తిడికి గుర్తైనట్లు తెలుస్తోంది. రెవెన్యూ విభాగం నుంచి బయటకు వచ్చిన దౌలత్ ఖాన్ ఆ విభాగం ఎదుటనే కుప్పకూలి పోయారు. అక్కడ ఉన్న సిబ్బంది ఆయనను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. కౌన్సిల్ ఆమోదం పొందిన ప్రొసిడింగ్స్‌ను పన్ను మినహాయింపు పొందిన వారికి గానీ, ఆ సచివాలయానికి కానీ పంపితే మినహాయింపు ప్రక్రియ మొదలవుతుంది. 2024 జులైలో ఆమోదం పొందిన మినహాయింపు ప్రొసిడింగ్స్‌ను దౌలత్ ఖాన్ ఆరు నెలలు జరిగిపోయినా అందుకోలేకపోయారు. దౌలత్ ఖాన్ కుటుంబానికి ఆయనే ఆధారం. ఆధారాన్ని కోల్పోయిన ఆ కుటుంబం తీవ్ర శోకసంద్రంలోకి వెళ్లిపోయింది. మాజీ సైనికులకు ప్రభుత్వం కల్పించే ఇంటి పన్ను మినహాయింపు ఇవ్వాల్సిన బాధ్యత నంద్యాల మున్సిపాలిటిపై ఉంది.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

### - అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని వెంకటాచలం కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. వార్డు ఇన్‌చార్జి అహమ్మద్ హుసేన్ ఆధ్వర్యంలో శాంతిరామ్ హాస్పటల్ సౌజన్యంతో వెంకటాచలం కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున వార్డు ప్రజలు పరీక్షలకు హాజరయ్యారు. వార్డు ఇన్‌చార్జి అహమ్మద్ హుసేన్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతంలో ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు హస్పటల్స్ యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ అహమ్మద్ హుసేన్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు ఆయన అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఉచిత వైద్య శిబిరంలో పరీక్షల అనంతరం అవసరమైన వారికి శాంతిరామ్ హస్పటల్స్‌లో ఉచితంగా కంటి పరీక్షలతోపాటు లెన్స్‌లను అందిస్తామన్నారు. అలాగే గుండె వ్యాధులకు సంబంధించిన వారికి ఉచితంగా ఇసిజిలను తీసి అవసరమయితే శాంతి రామ్ హస్పటల్‌లో వైద్య సేవలను అందిస్తామన్నారు.





## సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలి

- రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్



**కర్నూలు, మేజర్ న్యూస్ :** తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ ఎంతో ముఖ్యమైన పండుగని, మూడు రోజులపాటు నిర్వహించుకునే ఈ పండుగను ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో నిత్య నూతన వెలుగులు నింపి, ఆయురారోగ్య అష్ట ఐశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో, చిరు నవ్వులతో, సిరి సంపదలతో తులతూగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనిస్తూ ముందుకు సాగాలని, ప్రజలందరికీ జరగాలని ఆయన రాష్ట్ర ప్రజలందరికీ భోగి - సంక్రాంతి - కనుమ పండుగల శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి,కనుమ శుభాకాంక్షలు

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, మేజర్ న్యూస్ :** జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో, సిరి సంపదలతో తులతూగుతూ ఉండాలని, భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.. సంక్రాంతి పండుగను మొదటి రోజు భోగి మంటలతో, రెండవ రోజు సంక్రాంతి పండుగను పొంగలి, పిండివంటలతో, పితృ దేవతలు, దేవుళ్ల పూజలతో, మూడవ రోజు కనుమ పండుగను కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని, ప్రజలందరికీ మంచి జరగాలని జిల్లా కలెక్టర్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## సంక్రాంతి నేపథ్యంలో ప్రజా ఫిర్యాదుల దినం రద్దు

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సోమవారం భోగి కారణంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఫిర్యాదులు చేసేందుకు ప్రజలు రావద్దని, సుదూర ప్రాంతాల వారు గుర్తించాలని వారు కోరారు. వచ్చే సోమవారం ఈ కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని వారు చెప్పారు.

## రాష్ట్ర ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు - మంత్రి బి.సి



**బనగానపల్లెమేజర్,న్యూస్ః** రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు. రంగు రంగుల ముగ్గుల హరివిల్లులు మధ్యలో అందమైన గొబ్బెమ్మలు హరిదాసుల పాటలు, గంగిరెద్దుల ఆటలు , భోగి పళ్లు కొత్త అల్లుళ్లతో మన లోగిళ్లలో సరొకొత్త కాంతులు నింపే తెలుగింటి పండుగ సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో నూతన వెలుగులు నిండి ఆయురారోగ్య అష్ట ఐశ్వర్యాలతో సుఖ సంతోషాలతో, చిరు నవ్వులతో , సిరి పంపదలతో ప్రజలు తులతూగాలని మనసూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర రథసారధి విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో 5కోట్ల తెలుగు ప్రజల సంపూర్ణ సహకారంతో ఈ సంక్రాంత్రి నుంచి మరింత అభివృద్ధి దిశలో ఆంధ్రప్రదేశ్ ముందుకెళ్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.